# యువతీ యువకులకు ఉండవలసిన ముఖ్య లక్షణాలు

వివిధ శాస్త్రచయము వేదవేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చలేవు
తెరకు ఇవల జీవి దేవుడవ్వలనుండు
కార్యమివల నవల కారణంబు

**యు**వతీయువకులంటే కేవలం Young boys and girls అని మీరు భావిస్తున్నారు. కాని, ఇది సరియైన అర్థం కాదు. యువతీ యువకులకు ఉండవలసిన ముఖ్యలక్షణములను కొన్నింటిని సూచిస్తాను. ముఖ్యంగా యువకులు పవిత్రమైన భావములను, శౌర్యసాహసములను కలిగియుండాలి; శీలసంపత్తిని అభివృద్ధిపరచుకోవాలి; మంచి నడవడికను పోషించుకోవాలి; సత్సంగములో ప్రవేశించాలి. సత్సంగమనగా మంచివారితో సహవాసం (Good Company) అని చెప్తూ ఉంటారు. కాని, అది సరియైన అర్థం కాదు. 'సత్ - సంగము'. 'సత్' అనగా త్రికాలాబాధ్యమైనటువంటి సత్యము. త్రికాలములందు, త్రిలోకములందు, త్రిగుణములందు మార్పుచెందని దివ్యత్వమునకే 'సత్' అని పేరు. కాబట్టి, దివ్యత్వముతో సంగము ఏర్పర్చుకోవడమే సత్సంగము. సత్ప్రవర్తనకు సత్సంగము అత్యవసరము. ఈ సత్సంగముయొక్క విశిష్టతను ప్రధానంగా ప్రబోధించినవాడు మనుచక్రవర్తి. ఆయన ధర్మ శాస్త్రమును రచించి లోకములో వ్యాప్తి గావించినటువంటి ఋషి. "భద్రం శ్రుణ్వంతు, భద్రం పశ్యంతు, భద్రం కుర్వంతు" (మంచిని విను, మంచిని చూడు, మంచిపనులు చేయి) - ఇవియే మనుచక్రవర్తి యువతీ యువకులకు ప్రధానంగా బోధించి నటువంటి సూత్రాలు. కేవలం యువతీ యువకులకు మాత్రమే కాదు, సర్వమానవులకూ ఈ సద్గుణసంపత్తి అత్యవసరం. ఈ సద్గుణములను

sri sathyasai vachanamrutam

అలవర్చుకోవడం కష్టమని మీరు భావిస్తున్నారు. ఇది కష్టమే కాదు, చాలా సులభము. ఐతే, మీరు సరియైన మార్గమును అనుసరించకపోవడంచేతనే ఇది మీకు కష్టమనిపిస్తున్నది. మనుధర్మముపై ఆధారపడినదే ఈనాడు మనం నియమించుకున్న Law (న్యాయశాస్త్రము). కాని, ఈనాడు మను ధర్మము ఆచరణలో గోచరించడం లేదు.

ముఖ్యంగా మీరు మంచి చూపులు చూడాలి, మంచి శ్రవణం చేయాలి, మంచి కర్మలు ఆచరించాలి.

*"కన్నులందెప్పుడు కారుణ్యదృష్టియే*
*పలుకులెప్పుడు ముద్దులొలుకుచుండు*
*నగుమోము తనయందు అమృతభావమే*
*హృదయమెల్లప్పుడు ముదము గూర్చు"*

ఇటువంటి ఆదర్శవంతమైన జీవితాన్ని మీరు గడపాలి. అప్పుడే మీకు శాంతి లభ్యమౌతుంది. మీ మోముపై చిరునవ్వు నాట్యమాడాలి. చిరునవ్వు మానవత్వానికి మెరుగు తెస్తుంది. మానవుడనగా పవిత్రమైనవాడు అని అర్థం. అయితే, ఎప్పుడు తాను పవిత్రుడవుతాడు? మానవతాగుణములు అమితంగా ఉన్నప్పుడే తాను పవిత్రుడు కాగలడు. మానవతాగుణములు లేనివాడు మానవుడే కాదు; దానవుడనే చెప్పవచ్చును.

**'జనులకు కోపమువలన సర్వము చెడున్'**

మీరు శాంతస్వభావులై మెలగాలి. మిమ్మల్ని ద్వేషించే వ్యక్తి మీకెదురుగా వచ్చినప్పుడు, మీరు కూడా అతనిపట్ల ద్వేషాన్ని ప్రకటిస్తే ఇంక, రోడ్డు మధ్యలోనే మీ ఇద్దరిమధ్య జగడం ప్రారంభమౌతుంది. మీరతనిని శత్రువుగా చూస్తే, అతనిలో ద్వేషం మరింత అధికమౌతుంది. ద్వేషాన్ని అరికట్టుకోవాలంటే మొట్టమొదట ఏమి చేయాలి? అతనిని చూసిన తక్షణమే చిరునవ్వుతో, "హలో, మై ఫ్రెండ్..." అని పలుకరించాలి. తక్షణమే అతను కూడా "హలో మై ఫ్రెండ్.." అంటాడు. ఇద్దరూ కలసి ఆనందంగా హోటల్‌కి వెళతారు. మంచిమాటలతోనే స్నేహం, ఐకమత్యం అభివృద్ధి అవుతాయి. క్రోధంచేత ద్వేషం ప్రారంభమౌతుంది.

srisathyasaivachanamrutam

*కోపము కలిగినవానికి*
*ఏ పనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్*
*పాపపు పనులను చేయుచు*
*ఛీ, పొమ్మనిపించుకొనుట చేకూరు జుమీ!*

*తన కలిమి భంగపుచ్చును*
*తనకుంగల గౌరవము దగ్ధము సేయున్*
*తనవారల కెడ సేయును*
*జనులకు కోపము వలన సర్వము చెడున్*

క్రోధమున్నంతవరకు మనలో ప్రేమ అభివృద్ధి కాదు. కాబట్టి, క్రోధమునకు ఏమాత్రము అవకాశ మందించకూడదు. క్రోధము ప్రవేశించెనా, ఇక దానివెంట అనేక దుర్గుణములు ప్రవేశిస్తాయి. క్రోధమును అహంకారము అనుసరిస్తుంది. ఈ రెండూ ఉన్నచోట అసూయ ప్రారంభమౌతుంది. ఈ మూడు దుర్గుణాలు చేరేటప్పటికి మానవత్వమే శూన్యమౌతుంది. ప్రేమ ఉన్నచోట క్రోధముగాని, ద్వేషముగాని చేరడానికి వీలుకాదు. కాబట్టి, ప్రేమస్వరూపులారా! మీరు ప్రేమమయులు కండి. మీ హృదయాన్ని ప్రేమతో నింపుకోండి. మీ శరీరములో నఖశిఖపర్యంతం సంచరించే రక్తము కూడా ప్రేమమయం కావాలి.

**భగవంతుడు ఎక్కడున్నాడు?**

ఆధ్యాత్మిక సాధనలో మూడు స్థాయిలున్నాయి. ఒకటి, I am in the light (నేను వెలుగులో ఉన్నాను). రెండవది, The light is in me (వెలుగు నాలో ఉన్నది). మూడవది, I am the light (నేనే వెలుగును). నీవే వెలుగు అయినప్పుడు నీకు సర్వత్రా వెలుగు గోచరిస్తుంది. ఇది కేవలం భక్తిప్రపత్తులచేతనే సంభవిస్తుంది. భగవంతుడు ఎక్కడున్నాడు? అని అడిగితే కొందరు, "నాలో ఉన్నాడు," అని చెబుతారు. ఇది సరియైన జవాబు కాదు. ఈ కర్చీఫ్ ఎక్కడుంది? ఇది నా చేతిలో ఉంది. కాబట్టి, నా చేయి పెద్దది, కర్చీఫ్ చిన్నది. అదేవిధంగా, భగవంతుడు నీలో ఉన్నాడంటే, భగవంతుడు నీకంటే చిన్నవాడైపోతాడే! కాబట్టి, భగవంతుడు నీలో ఉన్నాడని చెప్పకూడదు. నీవే భగవంతునిలో



sri sathyasai vachanamrutam

ఉన్నావు. ఈవిధమైన భక్తి భావమును, వినయవిధేయతలను మనం పోషించుకోవాలి, ప్రసరింపజేయాలి. అప్పుడే లోకంలో ద్వేషమనేది నిర్మూలమైపోతుంది.

**సమీపత్వంలోనే స్వరూపం చక్కగా అర్థమౌతుంది**

వేదము, 'తత్ త్వం అసి' అని బోధిస్తున్నది. 'తత్' అనగా 'అది' (that); 'త్వం' అనగా 'ఇది' (this). ఇంద్రియాలకు దూరంగా ఉన్నదానిని 'అది' అంటారు. ఇంద్రియాలకు సమీపంగా ఉన్నదానిని 'ఇది' అంటారు. 'తత్' అనగా ఏమిటో మనం మొట్టమొదట అర్థం చేసుకోవాలి. 'తత్' అనగా నీకు దూరంగా ఉన్నటు వంటిది. 'త్వం' అనగా నీకు దగ్గరగా ఉన్నటువంటిది. దూరంగా ఉన్నంతవరకు దాని స్వరూపాన్ని నీవు గుర్తించలేవు. దగ్గరగా ఉన్నప్పుడే దాని స్వరూపాన్ని చక్కగా చూడగలవు. కాబట్టి, నీవు 'తత్' యొక్క స్వరూపమును చూడాలనుకుంటే దానిని 'త్వం'గా మార్చుకోవాలి. 'తత్' (దివ్యత్వము)ను నీవు దూరంగా పెట్టుకున్నావు. అందుచేతనే, దాని స్వరూపాన్ని గుర్తించలేకపోతున్నావు. ఒక చిన్న ఉదాహరణ: మసక చీకటిలో నీవు ఎక్కడికో నడచి వెళుతుంటే దారిలో ఒక త్రాడు అడ్డంగా పడి ఉంది. దూరం నుండి దానిని చూసినప్పుడు What is that? (అది ఏమిటి?) అన్న ప్రశ్న నీలో తలెత్తింది. అది దూరంగా ఉండడంచేత నీకు పాముమాదిరి కనిపించింది. దానిదగ్గరకు వెళ్ళి టార్చిలైటు వేసి చూశావు. 'ఇది పాము కాదు, త్రాడు,' అని గ్రహించావు; భయం తొలగిపోయింది; దానిని చేత్తో పట్టుకున్నావు. నీకు దూరంగా ఉన్నప్పుడు 'అది' పాము కావచ్చునని సందేహించి భయపడ్డావు. దగ్గరకు పోయిన తరువాత 'ఇది' పాము కాదు, త్రాడు అనే సత్యాన్ని గుర్తించావు. దివ్యత్వము నీకు దూరంగా ఉందనుకున్నప్పుడు, అనగా దివ్యత్వాన్ని 'తత్' (అది) అని భావించినప్పుడు నీలో భయ, సందేహాలు కలుగుతాయి. కనుక, మొట్టమొదట 'తత్' (అది)ని 'త్వం' (ఇది)గా మార్చుకోవాలి. అనగా, దివ్యత్వానికి సమీపంగా చేరాలి. ఉపనిషత్తు బోధించినది ఇదే! 'ఉప' – అనగా సమీపము, 'ని' – అనగా దగ్గర, 'షత్' – అనగా కూర్చో. దీని అంతరార్థమేమిటి? నీవు దివ్యత్వానికి సమీపంగా కూర్చో. సమీపత్వంలోనే నీకు స్వరూపము చక్కగా అర్థమౌతుంది. కనుక, ఉపనిషత్తు అంటే ఏదో వేదసారము అని భావించరాదు. దివ్యత్వముయొక్క సమీపత్వాన్ని

sri sathyasai vachanamrutam

నిరూపించేదే ఉపనిషత్తు. ఎక్కడికి పోయినప్పటికీ దివ్యత్వము నీకు సమీపంగానే ఉందని విశ్వసించాలి. దివ్యత్వానికి కేవలం 'నియర్'గా ఉంటే చాలదు, 'డియర్'గా కూడా ఉండాలి. అప్పుడే నీకు భయం దూరమౌతుంది. ఈనాడు మానవునిలో భయం ప్రవేశించడానికి కారణం దివ్యత్వముయొక్క స్వరూపాన్ని గుర్తించలేకపోవడమే!

**నారదునికి సనత్కుమారుడు చేసిన జ్ఞానబోధ**

విద్యార్థులారా! ఉపనిషద్వాక్యములు, మను చక్రవర్తి ప్రబోధలు చాలా నిగూఢమైనటువంటివిగా ఉన్నాయి. చక్కగా విచారణ చేసినప్పుడే అవి సూక్ష్మంగా అర్థమౌతాయి. మానవుడు ఎన్నియో చదువులు చదువుతున్నాడు, ఎన్నియో విషయాలను తెలుసుకుంటున్నాడు. కాని, మానవత్వంలో ఉన్న దివ్యత్వాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు. ఆ దివ్యత్వమే లేకపోతే మానవత్వమే లేదు. కాని, మానవుడు తనను తాను తెలుసుకోలేకపోతున్నాడు. ఒకానొక సమయంలో నారదుడు సనత్కుమారుని వద్దకు వెళ్ళాడు. "ఏం నారదా, దేనికోసం వచ్చావు?" అని అడిగాడు సనత్కుమారుడు. "నా నిజతత్వాన్ని తెలుసుకునేందుకు వచ్చాను" అని సమాధానమిచ్చాడు నారదుడు. "నీ నిజతత్వాన్ని తెలుసుకోవ డానికి నీకున్నటువంటి అర్హతలేమిటి?" అని ప్రశ్నింపగా, "నేను నాల్గు వేదములను, ఆరు శాస్త్రములను క్షుణ్ణంగా అధ్యయనం చేశాను" అన్నాడు నారదుడు. అప్పుడు సనత్కుమారుడు, "నారదా! ఆరు వేదములు, నాల్గు శాస్త్రములు చదివినవాడవు నీవెవరో నీకు తెలియదా? నీవు చదివిన విషయాలను ఆచరణలో పెట్టియుండినయెడల నీ నిజతత్వమును నీవు గుర్తించగలిగి ఉండేవాడివి. వేదశాస్త్రాలను అధ్యయనం చేస్తే సరిపోదు, ఆచరణలో పెట్టడం ప్రధానం" అని బోధించాడు.

**ప్రతి జీవీ భగవంతుని ప్రతిబింబమే!**

సనత్కుమారుడు నారదునికి చాలా మంచి విషయాన్ని తెలియజేశాడు. నిన్ను నీవు తెలుసుకోకుండా ఎన్ని వేదశాస్త్రములు పఠించినప్పటికీ, ఎన్ని తీర్థయాత్రలు సల్పినప్పటికీ అవన్నీ నిరుపయోగమైనవే! మొట్టమొదట నిన్ను నీవు తెలుసుకో. Who are you? (నీవెవరు?) అని ఇతరులను ప్రశ్నించే బదులు Who am I? (నేనెవరు?) అని నిన్ను

sri sathyasaivachanamrutam

నీవు ప్రశ్నించుకో. 'నేను' ఎవరో మొట్టమొదట తెలుసుకుంటే అందరిగురించి నీకు తెలిసిపోతుంది. కృష్ణుడు, "మమైవాంశో జీవ లోకే జీవభూతస్సనాతనః", "అందరూ నా ప్రతిబింబములే," అని ప్రకటించాడు. ఈ సత్యాన్ని గుర్తించినప్పుడు అందరియొక్క స్వరూపము మనకు అర్థమైపోతుంది. బింబప్రతిబింబములు వేరు కాదు. రెండూ ఒక్కటే. ఇట్టి ఏకత్వాన్ని గుర్తించలేక మానవుడు అనేకత్వమును చూసి భ్రమిస్తున్నాడు; ఏకత్వాన్ని అనేకత్వంగా విభజిస్తున్నాడు. తాను గొప్ప తెలివితేటలు గలవాడినని భావిస్తున్నాడు. ఇదే అహంకారమునకు కారణమవుతున్నది. అహంకారము వచ్చిందంటే అన్నీ వ్యర్థమైపోతాయి. అనేకత్వంలో ఉన్న ఏకత్వాన్ని తీసుకోవాలి. అప్పుడే పరిపూర్ణమైన ఆనందము లభ్యమౌతుంది. అట్టి దివ్యమైన ఆనందము మనకు లభ్యమైనప్పుడు ఇంక మనం దేనికీ విచారించనక్కర్లేదు. నాకెట్టి విచారములూ లేవు. నేనెప్పుడూ ఆనందంగానే ఉంటాను. మీ నిజతత్త్వాన్ని మీరు తెలుసుకున్నప్పుడు మీకుకూడా ఆనందము ప్రాప్తిస్తుంది. ఈనాడు మీరు ఆనందాన్ని పొందలేకపోవడానికి కారణమేమిటి? మీరెవరో మీకు తెలియడం లేదు. మీరందరూ దైవముయొక్క ప్రతిబింబములే! మీ రూపములన్నీ రిఫ్లెక్షన్లే! మీ యాక్షనే మీకు రియాక్షన్‌గా వస్తోంది. మీ సౌండే మీకు ప్రతిధ్వనిగా వినిపిస్తోంది. ఈ రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్‌లను చూసి మీరెందుకు విచారించాలి? 'ఇదంతా నానుండి వచ్చినదే,' అని భావించాలి. ఇప్పుడు నేనిక్కడ మాట్లాడడంవలన దీని ప్రతిధ్వని అందరికీ వినిపిస్తోంది. నేను మాట్లాడకపోతే ప్రతిధ్వని ఎట్లా వినిపిస్తుంది? కాబట్టి, 'రియాక్షన్', 'రిఫ్లెక్షన్', 'రీసౌండ్' మూడూ మననుండియే ఆవిర్భవిస్తున్నాయి. మన దుఃఖము మననుండి వచ్చినటువంటిదే! ఎవరో ప్రత్యేకంగా తెచ్చి మనకందించడం లేదు. అందిస్తే మనము అందుకోము కూడా! ప్రతి జీవీ భగవంతుని ప్రతిబింబమేనన్న సత్యాన్ని గుర్తించాలి. భగవద్గీత యందు ప్రధానంగా బోధింపబడినటువంటిది ఇదే! మనకు ఏది జరిగినప్పటికీ, 'ఇది నా రిఫ్లెక్షన్, ఇది నా రియాక్షన్, ఇది నా రీసౌండ్' అనే సత్యాన్ని మనం గుర్తించి వర్తించినప్పుడు సర్వం మనకు ఆనందమయంగానే ఉంటుంది.

sri sathyasai vahamrutam

**నిజతత్వాన్ని గుర్తిస్తే దుర్గుణాలకు తావుండదు**

ఒకానొక సమయంలో ఒక పశువుల కాపరి పశువులను తోలుకొని కొండల మధ్యకు వెళ్ళాడు. అక్కడ పశువులు గడ్డి మేస్తుంటే ఈ పిల్లవాడు గొంతెత్తి ఒక పాట పాడడం ప్రారంభించాడు. అది కొండప్రాంతం కావడంచేత అతను పాడే పాట పరిసరాల్లో ప్రతిధ్వనించసాగింది. "ఏమిటిది? నాకు పోటీగా నేను పాడిన పాట మళ్ళీ ఎవరో పాడుతున్నాడే!" అనుకున్నాడా అమాయకుడు. "ఏయ్, ఎవరు నీవు? నేను పాడినట్లుగా ఎందుకు పాడుతున్నావు?" అని గట్టిగా అరిచాడు. అవే మాటలు తిరిగి వినిపించాయి. అతనికి చాలా కోపం వచ్చింది. 'వీడెవడు? మన గ్రామంవాడా? లేక, ప్రక్కగ్రామంవాడా? ఎందుకు నన్నీవిధంగా అవమానిస్తున్నాడు?' అని అనుకున్నాడు. ఆ మరునాడు వాడెవరో తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు. సాయంకాలం ఇంటికి వెళ్ళిన తరువాత జరిగిన సంగతి తల్లితో చెప్పాడు. "నాయనా! రేపటిదినము నేనూ నీవెంట వస్తాను. నీవేమీ భయపడవద్దు" అని ఆమె పిల్లవానికి ధైర్యం చెప్పింది. ఆ మరుసటి దినము ఆమె వానివెంట వెళ్ళింది. "నాయనా! నిన్న నీవు పాడిన పాట మళ్ళీ పాడు" అని చెప్పింది. వాడు పాడడం ప్రారంభించాడు. యథాప్రకారం దాని ప్రతిధ్వని వినిపించింది. "అమ్మా చూడు, వాడెవరో నేను పాడినట్లే పాడుతున్నాడు," అన్నాడు. తల్లి పక్కున నవ్వి, "పిచ్చివాడా! నీవు పాడుతున్న పాటే ఈ కొండలనుండి ప్రతిధ్వనిస్తోంది. ఎవరో పరాయి వాడు నిన్ను హేళన చేస్తున్నాడని భ్రమించి నీవు కోపం తెచ్చుకుంటున్నావు" అన్నది. ప్రతిధ్వని అనేది ఉన్నదని తెలుసుకొని ఆ పిల్లవాడు చాలా ఆశ్చర్యపడ్డాడు. అది 'రీసౌండ్' అని తెలియక పూర్వం అతనికి కోపం వచ్చింది. యథార్థము తెలిసిన తరువాత అతనికి మళ్ళీ కోపం రాలేదు. భగవద్గీతలో కృష్ణుడు చెప్పింది కూడా ఇదే! 'అందరూ నా అంశములే' అన్నాడు. ఈ సత్యాన్ని తెలుసుకున్న వ్యక్తికి ఇతరులపైన కోపము రాదు. మానవుడు తన నిజతత్వాన్ని గుర్తించుకోలేక పోవడంవలననే కోపము, ద్వేషము, అసూయ మొదలైన దుర్గుణాలకు చోటిస్తున్నాడు. సత్యము తెలియకపోవడంచేతనే తాను అనేక బాధలకు గురి అవుతున్నాడు. భగవంతుని తత్వాన్ని గుర్తించవలెనన్న మొట్టమొదట తన తత్వాన్ని తాను గుర్తించుకోవాలి.

త్యాగరాజు, "తెలిసి రామచింతన చేయవే మనసా!" అన్నాడు. అనేకమంది

sri sathyasai vahanamrutam

రామనామస్మరణ చేస్తూ ఉంటారు. ఐతే, రామనామములో ఎటువంటి మహాత్మ్యం ఉన్నదో గుర్తించారా?

> **కపి వారిధి దాటునా? కలికి రోటగట్టునా?**
> **అపరాధి త్యాగరాజు ఆనందము నొందునా? మా**
> **అప్ప రామభక్తి యెంతో గొప్పరా!**

కోతి ఎక్కడైనా సముద్రాన్ని దాటగల్గుతుందా? ఇది కేవలం రామనామ దివ్యమహిమచేతనే సాధ్యమైంది.

**మూడు రకములైన ఋణములు**

ప్రతి వ్యక్తీ మూడు రకములైన ఋణములతో పుడుతున్నాడు. 1. దైవ ఋణము. 2. ఋషి ఋణము. 3. పితృఋణము. దైవఋణము తీర్చుకోవడానికి సత్కర్మలను ఆచరించాలి. భగవంతుడు ప్రతి అంగములోనూ రసస్వరూపుడై సంచరిస్తూ, దేహాన్ని సంరక్షిస్తున్నాడు. కనుకనే, భగవంతుణ్ణి 'అంగీరసాయనమః' అని స్తుతిస్తున్నారు. పగటిపూట మీరు కన్నులతో చూస్తున్నారు, చెవులతో వింటున్నారు, మనసుతో అనుభవిస్తున్నారు. అన్ని రకాలుగా మీ భద్రతను మీరు చూసుకుంటున్నారు. కాని, రాత్రిపూట నిద్రించిన తరువాత మీ దేహాన్ని కాపాడేది ఎవరు? భగవంతుడే! జాగ్రత్స్వప్న సుషుప్తులందు మిమ్మల్ని కాపాడేది భగవంతుడే! వేదము 'రసోవై సః' అని చెప్పింది. రసస్వరూపుడైన భగవంతుడు మీ దేహంలో ఉంటూ మిమ్ములను సర్వవిధాలుగా సంరక్షిస్తున్నాడు. ఇంతటి దయామయుడైన దైవానికి మీరు కృతజ్ఞత చెప్పుకోనక్కర్లేదా? ఆయనకు కృతజ్ఞతలు తెల్పుకునే నిమిత్తమై మీరు సత్కర్మల నాచరించాలి; సద్బుద్ధితో మెలగాలి; సదాచారములతో ప్రవర్తించాలి; సమాజ సేవలో పాల్గొనాలి. అప్పుడే మీరు దైవఋణము తీర్చుకున్నవారవుతారు.

రెండవది ఋషిఋణము. ఋషులు మనకు చేసిన ఉపకారమేమిటి? వారు వేదశాస్త్ర ఇతిహాస పురాణములను రచించి, మనకు భగవంతునిపై నమ్మకం కలిగేటట్లుగా చక్కని ప్రబోధలు సల్పుతూ వచ్చారు. ఋషులు ప్రబోధించిన మార్గములో మనం నడుచుకున్నప్పుడు మనం ఋషిఋణమును తీర్చుకున్న వారమవుతాము.

sri sathyasai vachanamrutam

ఇక, మూడవది పితృఋణము. మన దేహానికి తల్లిదండ్రులే సరియైన అధికారులు. మిమ్మల్ని నవ మాసములు మోసి, కని పెంచి పెద్దచేస్తుంది తల్లి. మీకు విద్యాబుద్ధులు నేర్పి, అన్నవస్త్రాదులను సమకూర్చి అన్నివిధాలుగా పోషిస్తాడు తండ్రి. అట్టి తల్లిదండ్రులకు మీరు కృతజ్ఞత చెప్పుకోనక్కర్లేదా? వేదము "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవో భవ." అని బోధించింది. తల్లిదండ్రులను ప్రేమించి, సేవించినప్పుడే మీరు పితృఋణమును తీర్చుకున్న వారవుతారు. ఈ మూడు ఋణములు తీరెనా, ముమ్మూర్తులదగ్గరకు మీరు చేరుకుంటారు.

ఈనాటి పిల్లలకు తల్లిదండ్రులపట్ల గౌరవమే లేదు. తల్లి, 'నాయనా, ఒకసారి ఇక్కడికి రా,' అని పిలిస్తే, 'ఎందుకోసం రావాలి?' అని విసుక్కుంటారు. మానవుడు పుట్టినప్పటినుండి తల్లి ఒడిలోనే పెరుగుతాడు. తల్లి ఎంతో ప్రేమతో సాకుతుంది; తండ్రి అన్నివిధాలుగా పోషిస్తాడు. అటువంటి తల్లిదండ్రులను గౌరవించనివాడు, వారికి కృతజ్ఞత చూపనివాడు దుర్మార్గుడు, ద్రోహి, కీచకుడు! మీరు మొట్టమొదట మీ తల్లిదండ్రులను గౌరవించాలి. తల్లి తన బిడ్డను ఒడిలో పరుండబెట్టుకొని లాలిపాటలు పాడుతూ మొట్టమొదట సద్గుణములు నేర్పిస్తుంది. కాబట్టి, తల్లియే ప్రథమ గురువు. తండ్రి రెండవవాడు. గురువు మూడవవాడు, దైవము నాల్గవ వాడు. కనుకనే, 'తల్లి, తండ్రి, గురువు, దైవము,' అన్నారు. తల్లి ప్రేమస్వరూపిణి. సాధారణంగా ఆడవారియందున్న ప్రేమతత్త్వము, భక్తిప్రపత్తులు మగవారి యందు కనిపించవు. రాజసౌధములో మగవారు దర్బారు హాలువరకే వెళ్ళగలరు గాని, ఆడవారు నేరుగా అంతఃపురములోకి వెళ్ళవచ్చును. అదేరీతిగా, భక్తి ప్రపత్తులు గలవారు భగవంతుని హృదయంలోకి ప్రవేశిస్తారు. అవతార పురుషుడైన శ్రీరామునికి జన్మనిచ్చిన కౌసల్యాదేవి అదృష్టాన్ని కొనియాడుతూ త్యాగరాజు ఇలా గానం చేశాడు:

"తళుకు చెక్కుల మోము ముద్దిడ కౌసల్య మును
తపమేమి జేసెనో తెలియ
దశరథుడు శ్రీరామ రారాయని పిలువ మును
తపమేమి జేసెనో తెలియ"

sri sathyasai vachanamrutam

'రామా, రారా' అని పిలువడానికి దశరథుడెంత తపస్సు చేశాడో! బజార్లో పోయే పిల్లలందరినీ మనం 'రారా' అని పిలువము కదా? రాముడు తన కుమారుడు కనుకనే దశరథుడు ఆవిధంగా పిలువగల్గినాడు. అవతార పురుషునికి జన్మ నివ్వడం, అవతార పురుషుణ్ణి పోషించడం... ఇదంతా గొప్ప తపః ఫలితమే!

**దైవాన్ని దర్శించడానికి జ్ఞానచక్షువులు కావాలి**

ప్రేమస్వరూపులారా! యౌవనదశలో ఉన్నంత మాత్రాన మిమ్మల్ని Youth (యువజనులు) అని పిలువడానికి వీలుకాదు. పరిపూర్ణమైన ప్రేమతత్త్వంచేత ప్రవర్తించేవారే నిజమైన యువజనులు. మీరందరూ భక్తిప్రపత్తులను పెంచుకోవాలి. కష్టములోగాని, సుఖములోగాని, ఏ సమయమునందైనా దైవనామాన్ని స్మరిస్తూ ఉండాలి. అప్పుడు ఈ లౌకికమైన చింతలు మీ హృదయానికి ఏమాత్రం అంటవు. మన చుట్టూ ఉన్నటువంటిది దైవత్వమే! "సర్వతః పాణిపాదం..." దైవము లేనటువంటి స్థానమే లేదు. ఎక్కడ చూసినా భగవంతుడే ఉన్నాడు. అయితే, 'చూపించండి, చూస్తాం,' అని మీరనవచ్చు. నేను చూపిస్తాను గాని, చూసే నేత్రాలు మీకున్నాయా? అడిగే నాలుక ఉందిగాని, చూసే నేత్రాలను మీరు సంపాదించుకోలేదు. కళ్ళు మూసుకొని దైవాన్ని కళ్ళారా చూడాలంటే ఎలా సాధ్యమౌతుంది? మీ కన్నులను తెరుచుకోండి. కన్నులంటే భౌతికమైన చక్షువులు కావు. భగవంతుని చూడడానికి జ్ఞానచక్షువులు కావాలి. చర్మచక్షువులతో ప్రపంచాన్నంతా మనం చూస్తున్నాము. మనమే కాదు; పాములూ చూస్తున్నాయి; తేళ్ళూ చూస్తున్నాయి; కప్పలూ చూస్తున్నాయి; క్రిమి కీటకాదులుకూడా చూస్తున్నాయి. చూసినంతమాత్రాన వాటికి దైవం గోచరిస్తున్నాడా? లేదు. కాబట్టి, భగవంతుడు మీచెంతనే ఉన్నప్పటికీ అతనిని చూడాలంటే మీరు జ్ఞాననేత్రాలను సంపాదించుకోవాలి. అందునిమిత్తం మీరు భక్తి ప్రపత్తులను అభివృద్ధిపరచుకోవాలి. ఎప్పుడు ఆ హక్కును మీరు సంపాదిస్తారో అప్పుడు దైవాన్ని మీ స్వంతవానిగా భావిస్తారు. దైవము దైవముగానే ఉన్నాడంటే అతనిని మీరు భయభక్తులతో గౌరవిస్తారు. కాని, దైవము మీ స్వంతవాడైనప్పుడు భయము లేకుండా అతనితో ఎంతో చనువుగా, ప్రేమగా ఉంటారు. కాబట్టి, దైవము మీ స్వంతవాడు కావాలి. రాముడు మీవాడు కావాలి. త్యాగరాజు రాముణ్ణి తనవానిగా భావించడంచేతనే,

sri sathyasaivachanamrutam

"రార మా ఇంటిదాక
రఘువీర సుకుమార నే మ్రొక్కెద
రార మా ఇంటిదాక..."

అని గానం చేశాడు. తాను రాముణ్ణి 'రారా' అని పిలిచాడు. భగవంతుణ్ణి గౌరవంగా పిలువనక్కర్లేదా? 'రండి, కూర్చోండి' అని గౌరవంగా పిలిస్తే భగవంతుడు మనకు క్రొత్తవాడైపోతాడు. క్రొత్త వారిని మనం గౌరవ మర్యాదలతో ఆహ్వానిస్తాము. కాని, పాతస్నేహితుణ్ణి 'రారా' అంటూ హృదయపూర్వకంగా పిలుస్తాము. అతని స్నేహాన్ని ఎంతో ప్రేమతో, ఆనందంతో అనుభవిస్తాము. అదేరీతిగా, భగవంతుణ్ణి మన పాతస్నేహితునిగా భావించాలి.

**తల్లిదండ్రులను గౌరవించనివాడు పరమ రాక్షసుడు!**

ప్రేమస్వరూపులారా! మొట్టమొదట మీ హృదయాన్ని పవిత్రం చేసుకోండి. అప్పుడే మీరు దైవాన్ని మీ స్వంతవానిగా భావించగలరు. దైవ ఋణాన్ని తీర్చుకోవడానికి ప్రయత్నం చేయండి. మన దేహంలోని అణువణువునందును, కణకణమునందును దైవము సంచరిస్తూ మనలను సంరక్షిస్తూ ఉన్నాడు. మీ శరీరములో ఉన్న రక్తము బయటికి రాకుండా ఎవరు కాపాడుతున్నారు? దైవమే! దైవానికి మీపై ఎంతో దయ ఉంది కాబట్టే, రక్తాన్ని మీ లోపలనే పెట్టి సర్వాంగములలోనూ సంచరింపజేస్తున్నాడు. మీ ఫుడ్డు (ఆహారము) మిమ్మల్ని రక్షిస్తున్నదని మీరనుకుంటున్నారు. ఫుడ్డు కాదు, బ్లడ్డు (రక్తము) కాదు. 'గాడ్' (దైవము) మిమ్మల్ని సంరక్షిస్తున్నాడు. అయితే, మీ దేహములో 'బ్లడ్డు' ఎక్కడినుండి వచ్చింది? మీ తల్లిదండ్రుల ఆహారమునుండియే వచ్చింది. కాబట్టి, మొట్టమొదట మీరు తల్లిదండ్రులను గౌరవించాలి, వారికి తగినవిధంగా కృతజ్ఞత చూపాలి. ఈనాడు మీ తల్లిదండ్రులను మీరు గౌరవించకపోతే రేపటిదినము మీ పిల్లలు మిమ్మల్ని గౌరవించరు. అప్పుడు ఏడుస్తూ కూర్చుంటే ప్రయోజనమేమిటి? తల్లిదండ్రులను గౌరవించనివాడు పరమరాక్షసుడనే చెప్పవచ్చును. అలాంటి రాక్షసులుగా మీరు తయారుకాకూడదు. మొట్టమొదట మీరు మానవులుగా తయారుకావాలి. మానవుడనగా

sri sathyasaivachanamrutam

ఎవరు? 'మా - న - వ'. 'మా' అనగా అజ్ఞానము, 'న' అనగా లేకుండా, 'వ' అనగా వర్తించడం. కాబట్టి అజ్ఞానము లేకుండా వర్తించేవాడే మానవుడు.

**పుండరీకుని కథ**

ప్రేమస్వరూపులారా! యువజనులంటే ఎవరనుకున్నారు మీరు? చిన్న వయస్సువారు, యౌవనులు అని అనుకుంటున్నారు. యౌవనమనేది వయస్సుపై, దేహపటుత్వంపై ఆధారపడిలేదు. ప్రేమ, సహనం, సానుభూతి, సత్యము, ధర్మము ఇలాంటి సద్గుణాలు గలవారే నిజమైన యువజనులు. ఇలాంటి యువజనులంతా ఏకమైనప్పుడే జగత్తు రక్షింపబడుతుంది. ఈ ప్రపంచానికి యువతీయువకులే మూలాధారమైనవారు. యువకులు కసరత్తు చేసి కండలు పెంచుకుంటే సరిపోదు, బుద్ధినికూడా బలపరచుకోవాలి. మీరు తల్లిదండ్రులను గౌరవిస్తే దైవమే స్వయంగా మీవద్దకు వస్తాడు. పుండరీకుడు తల్లిదండ్రుల పాదాలు ఒత్తుతూ ఉండగా పాండురంగడు వచ్చి, "ఏమయ్యా పుండరీకా, నేను వచ్చాను" అన్నాడు. "ఓహో మీరు వచ్చారా స్వామీ, కొంచెంసేపు ఈ ఇటుకపైన కూర్చోండి. నా తల్లిదండ్రుల సేవ పూర్తయిన తరువాత నేను మీతో మాట్లాడుతాను" అంటూ పుండరీకుడు తన ప్రక్కనున్న ఒక ఇటుకను తీసి ఆవైపు విసిరాడు. అతనిని పరీక్షించే నిమిత్తం పాండురంగడు, "ఒరే పిచ్చివాడా, నేను, సాక్షాత్తు పాండురంగడినే స్వయంగా వచ్చినప్పుడు నాతో మాట్లాడకుండా తల్లిదండ్రుల సేవచేస్తానంటావేమిటి?" అన్నాడు. అప్పుడు పుండరీకుడు, "స్వామీ! ఇంతకాలం మీరు నాతో ఎందుకు మాట్లాడలేదు? ఇంతవరకు మీరు ఎక్కడున్నారు? నేనెక్కడున్నాను? నన్ను కని పెంచి పోషించి రక్షించినవారు నా తల్లిదండ్రులు. కాబట్టి, మొట్టమొదట వారికి సేవ చేసి, తరువాత మీకు సేవ చేస్తాను" అన్నాడు. తల్లిదండ్రులపట్ల అతనికి గల భక్తికి పాండురంగడు ఎంతో ఆనందించి, "నాయనా! ఇదే నిజమైన భక్తి. ఇదే నిజమైన ప్రేమతత్త్వం" అన్నాడు.

ఇట్టి నిత్యసత్యమైన భక్తితత్త్వాన్ని ఆచరణలో పెట్టకుండా కొందరు యాంత్రికంగా పూజలు చేస్తుంటారు. అలాంటి పూజలవలన వచ్చే ఫలిత మేమీ లేదు. భగవంతునికి పూజలు ముఖ్యము కాదు; తల్లిదండ్రులను ప్రేమించడమే ముఖ్యము. వేదము, "మాతృదేవో

sri sathyasai vachanamrutam

భవ, పితృదేవో భవ..." అని బోధిస్తోంది. కాబట్టి, మొదలు తల్లిదండ్రులను చూసుకోండి. తరువాత దైవాన్ని చూసుకోవచ్చు. దైవత్వాన్ని తెలుసుకోవాలంటే మీరు తల్లిదండ్రులపట్ల భక్తిని కల్గియుండాలి. కనుక, నేటినుండైనా మీరు తల్లిదండ్రులను ప్రేమించి, గౌరవించి వారి ప్రేమకు పాత్రులు కండి. అదే నిజమైన భక్తి. అదే నిజమైన మానవత్వం. అట్టి మానవత్వం లేకుండా ఎన్ని పూజలు చేసినా ప్రయోజనంలేదు.

**మాతృమూర్తి ఈశ్వరమ్మ ఆదర్శం**

ఈ దేహానికి సంబంధించిన ఒక చిన్న విషయాన్ని చెబుతాను. ఈ దేహముయొక్క తల్లి ఈశ్వరమ్మ ఒక పర్యాయం నాదగ్గరకు వచ్చి, "స్వామీ, మీయందు సర్వశక్తులూ ఉంటున్నాయి. మనది చాలా చిన్నపల్లె. ఇక్కడ చిన్నపిల్లలకొరకు ఒక చిన్న ఆసుపత్రి కట్టించండి," అని కోరింది. ఆమె కోరిక ప్రకారం ఈ చిన్నపల్లెకు తగినటువంటి ఒక చిన్న ఆసుపత్రి కట్టించాను. దాని ప్రారంభోత్సవానికి అప్పటి ముఖ్యమంత్రి గోపాల్‌రెడ్డి వచ్చాడు. కొంతకాలమైన తరువాత ఈశ్వరమ్మ మరో కోరిక కోరింది. "స్వామీ, మన గ్రామంలోని చిన్నపిల్లలు చదువు నిమిత్తం బుక్కపట్టణానికి పోవలసివస్తోంది. పిల్లలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అంత దూరం నడచిపోవడం చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంది. వాళ్ళకొరకు ఒక చిన్నస్కూలు కట్టించండి" అని అడిగింది. సరే, స్కూలు కట్టించాను.

క్రమక్రమేణ స్వామి ప్రభావం చాలా పెరుగుతూ వచ్చింది. మరొక రోజు ఆమె నావద్దకు వచ్చి, "స్వామీ, సమాజానికి మీరెన్నో సేవలు చేస్తున్నారు. ఆసుపత్రి కట్టించమంటే కట్టించారు. స్కూలు కట్టించమంటే కట్టించారు. అయితే, నాది మరొక్క కోరిక ఉన్నది. మన పల్లెవారు నీటికోసం చాలాదూరం పోవలసి వస్తోంది. అంతదూరం నుండి నీళ్ళు మోసుకు రావడంవల్ల వాళ్ళ భుజాలు కాయలు కాస్తున్నాయి. దయచేసి ఒక చిన్నబావి త్రవ్వించండి," అని కోరింది. త్రవ్విస్తానన్నాను. ఆనాడు ఆమె కోరింది అణుమాత్రమే! ఒక చిన్నస్కూలు కట్టించమని కోరింది. ఇప్పుడొక పెద్ద యూనివర్సిటీ ఏర్పడింది. ఆనాడొక చిన్నహాస్పిటల్ కట్టించమని చెప్పింది. ఇప్పుడు పెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పడ్డాయి. "స్వామీ, ఒక బావి త్రవ్వించి మన పల్లెవారికి నీళ్ళు అందించండి," అని కోరింది. ఇప్పుడు

sri sathyasai vachanamrutam

అనంతపురం అంతటికీ నీళ్ళందించాను. ఇంత అడిగితే అంత ఇస్తాను నేను. కాని, అడిగేవారు నాదగ్గరకు రావడం లేదు. అడుగు తున్నారు. కాని, ఏవిధంగా అడుగుతున్నారు? హృదయం నుండి అడగడం లేదు; కేవలం పెదవులనుండి అడుగుతున్నారు. **"వెతుకుచున్నాను నేను, వెతుకుచునే ఉన్నాను; వెతుకుచుంటి నాడు, నేడు నిజమానవ ధర్మపరుని"** ఆనాటినుండి ఈనాటి వరకు నేను నిజమానవ ధర్మపరునికోసం వెతుకుతూనే ఉన్నాను. కాని, ఎక్కడా దొరకటం లేదు. మానవుడు ధర్మపరుడు కావాలి. అప్పుడే తాను సత్యస్వరూపాన్ని అర్థం చేసుకోగలడు.

ప్రేమస్వరూపులారా! మీ తల్లిదండ్రులను గౌరవించండి, వారి అభీష్టములను నెరవేర్చండి. మీ గ్రామానికి తగిన సేవ చేయండి. మీ గ్రామాన్ని చక్కగా అభివృద్ధికి తెప్పించుకోండి. అందరూ మిమ్మల్ని గౌరవించాలంటే మీరు మొట్టమొదట ఆత్మగౌరవాన్ని పోషించుకోవాలి.

(తేదీ 12.04.2003, కేరళ యువత సాధనా శిబిరము, బృందావనం)

sri sathyasai vachanamrutam